క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన చేపూరి బాబురావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని స్నేహితులు శ్రీనివాస్, పురుషోత్తం, వెంకటేశం, శ్రీనివాస్‌లు సోమవారం బాధిత కుటుంబసభ్యులకు రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఏబీవీపీ ఎంజీయూ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

నల్లగొండ టూటౌన్, చిట్యాల: ఏబీవీపీ ఎంజీ యూనివర్సిటీ నూతన కమిటీని నియమించినట్లు సోమవారం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు నక్కల జానారెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా రాగిఫణి హనుమాన్‌చారి, కార్యదర్శిగా మోహన్‌సాయి నియామకమైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా చిట్యాల పట్టణానికి చెందిన కొంపెల్లి సూర్య నియామకమయ్యారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జరిమానా

రామగిరి(నల్లగొండ): ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రూ. 5వేల జరిమానా విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు రెండవ అదనపు జడ్జి రోజారమణి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జిల్లా శంకర్ తిప్పర్తి మండలం సర్వారం గ్రామం వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. 2019లో అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన తాటి కరుణాకర్ రెడ్డి సర్వారం శివారులో తమ పేరున ఉన్న పట్టా మార్పిడి కోసం వీఆర్‌ఓ శంకర్‌ను సంప్రదించాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి శంకర్‌తో ఘర్షణకు దిగాడు. ఈమేరకు శంకర్ తిప్పర్తి పోలీస్ స్టేషన్లో కరుణాకర్ రెడ్డి పై ఫిర్యాదు చేశాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలతో ఏకీభవించిన జడ్జి.. విధులకు ఆటంకం కలిగించినందుకు నిందితుడికి రూ. 5 వేల జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వక్ఫ్‌బోర్డు భూమిని కాపాడాలి

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని మునుగోడు రోడ్డులో ఉన్న వక్ఫ్ బోర్డు భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ డాక్టర్ ఏఏ ఖాన్ సోమవారం డీఆర్‌ఓ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మొత్తం 18.9 ఎకరాల భూమికి 7.9 ఎకరాల భూమిని ఆక్రమించి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈభూమిని సర్వే చేసినప్పటికీ రక్షణ చర్యలు చేపట్టలేని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

కట్టంగూర్: కట్టంగూర్ మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్ రావు అధ్యక్షతన ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా తెలుసూరి జయసుధ, ప్రధాన కార్యదర్శిగా మన్నెం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సాయికృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీఓ చింతమల్ల చలపతి, కట్టెబోయిన పెద్దయ్యయాదవ్, సరస్వతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టిప్పర్స్ అసోసియేషన్ ఎన్నిక

నల్లగొండ : నల్లగొండ టిప్పర్స్ అసోసియేషన్‌ను సోమవారం స్థానికంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కంచరకుంట్ల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జెర్రిపోతుల ఉపేందర్, ఉపాధ్యక్షులుగా శ్యామల శ్యాంసుందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా గౌరవ సలహాదారుడిగా ఊట్కూర్ వెంకట్ రెడ్డి, సహాయకార్యదర్శిగా మహేష్, ప్రచార కార్యదర్శిగా జెర్రిపోతుల అశోక్, కోశాధికారిగా బొంగరాల శంకర్ ఎన్నికయ్యారు.

బుల్లెట్ వాహనదారులకు కౌన్సిలింగ్

నకిరేకల్: పట్టణంలో బుల్లెట్ వాహనాలకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసి రైడ్ చేస్తున్న ఐదుగురిని సోమవారం రాత్రి నకిరేకల్ పోలీసులు పట్టుకున్నారు. బైక్‌లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనాల సైలెన్సర్లు మార్పించారు. అనంతరం వారికి సీఐ రాజశేఖర్ కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

మట్టి తరలింపునకు అవకాశం కల్పించాలి

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమకు అవసరమైన మట్టి తరలింపునకుగాను వెలిమినేడు గ్రామ పరిధిలోని ట్రాక్టర్ యజమానులకు అవకాశం కల్పించాలని కోరతూ ఆ గ్రామ ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం చిట్యాల తహసీల్దార్ కృష్ణనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. వెలిమినేడు గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమకు పెద్దకాపర్తి నుంచి టిప్పర్ల ద్వారా మట్టి తోలుతున్నారని, దీంతో ట్రాక్టర్లపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న వెలిమినేడు గ్రామానికి చెందిన రెండు వందల మంది ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్స్‌కు ఇబ్బందిగా మారిందన్నారు. ట్రాక్టర్ల ద్వారా తమకు మట్టి తోలకం పనులకు అనుమతులివ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వెలిమినేడు ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన చెట్లు

- మార్జిన్ వరకు పెరిగిన చెట్లు
- ఎదురుగా భారీ వాహనాలు వస్తే తప్పని ఇబ్బందులు

తిప్పర్తి: తిప్పర్తి నుంచి నకిరేకల్ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. గతంలో ఈ రోడ్డు సింగల్‌గా ఉండేది. గత ప్రభుత్వంలో డబుల్ రోడ్డుగా మార్చారు. అయితే ప్రస్తుతం చెట్లకొమ్మలు రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు జరిగే వీలు లేకుండా కంపచెట్లు ఉన్నాయి.



ఇండ్లూర్ సమీపంలో రోడ్డు మార్జిన్ వరకు పెరిగిన చెట్లు

సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన మార్జిన్ వరకు చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



నకిరేకల్ వెళ్లే దారిలో చెట్లు రోడ్డును ఆనుకుని ఉన్నాయి. దీంతో ఎదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు పక్కకు జరగడానికి మార్జిన్ లేకుండా ఉంది. ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి మార్జిన్ ఏర్పాటు చేయించాలి. – నల్ల శ్రీనివాస్, ఆటోడ్రైవర్, తిప్పర్తి

మార్జిన్ వరకు సరిచేస్తాం

నకిరేకల్ – తిప్పర్తి రోడ్డులోని ఇండ్లూరు సమీపంలో అక్కడక్కడా చెట్లు రోడ్డు వెంట పరుచుకున్నాయి. వాటిని త్వరలోనే తొలగించి మార్జిన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. వాటిని కూడా మార్జిన్ వరకు సరిచేస్తాం. – గౌస్, ఆర్అండ్‌బీ ఏఈ

ఆపదమిత్ర వలంటీర్లకు రెండో విడత శిక్షణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: జాతీయ విపత్తు ప్రతిస్పందన, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాల ఆధ్వర్యంలో నల్లగొండలో మహిళా వలంటీర్లకు చేపట్టిన రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ ఈ నెల 24 నుంచి 12 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, జిల్లా ఫైర్, అటవీ, వైద్య, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మత్స్య, ఇంజనీరింగ్ శాఖల అధికారులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. మంటలు, వరదలు, భూకంపాలు, విపత్తుల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్షించడం, ప్రథమ చికిత్స అంశాలపై వలంటీర్లకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి చరిత, వైద్యాధికారి మాతృ, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, నాగమణి, తరుణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక కాల్వలు తవ్వించి చెరువులు నింపుతాం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

మునుగోడు: బి.వెల్లెంల ఉదయసముద్రం నుంచి ప్రత్యేక కాల్వలు తవ్వించి మునుగోడు మండలంలోని పులిపల్పుల, కల్వలపల్లి గ్రామాల చెరువులు నింపుతామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఐబీ అధికారులు, ఆయా గ్రామాల రైతులతో కలసి సోమవారం ఆయన కాల్వ తవ్వకానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇరు గ్రామాల రైతులు తమ గ్రామంలోని చెరువుల్లో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి వరి పొలాలు ఎండిపోతున్నాయని, ఉదయసముద్రం నుంచి నీరు పారించాలని కోరారని పేర్కొన్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే తన సొంత డబ్బులతో 500 మీటర్ల దూరంలో ఉన్న చెరువుకు కాల్వ తీయించి నీరు పారిస్తానని అందుకు అనువైన స్థలాన్ని పరిశీలించాలని చెప్పినట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ, చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, గోపగోని పాపయ్య, గంగొరిగూడెం, పులిపలుపుల, కల్వలపల్లి రైతులు ఉన్నారు.



చెరువులోకి నీరు మళ్లించేందుకు అవసరమైన కాల్వలను పరిశీలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, అధికారులు

జిల్లా స్థాయి యువ ఉత్సవ్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు

నల్లగొండ టూటౌన్: వికసిత్ భారత్ లక్ష్యంగా జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం మార్చి 5న నిర్వహించనున్నామని, యువత తమ ప్రతిభను చాటుకోవాలని ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు తెలిపారు. సోమవారం నల్లగొండలో భారత యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ కళాకారులు, రచయితలు, ఫొటో గ్రాఫర్‌లు, వక్తలు, సంప్రదాయ కళాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ప్రవీణ్‌సింగ్, ఎంకే నాయక్, అమరావతి, శ్రీనివాస్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన పలువురు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు స్టేట్ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్థికసాయాన్ని సోమవారం గ్రామ స్థానిక నాయకులు అందజేశారు. పాకాల నరేష్ కుటుంబానికి రూ.20వేలు, జనపాల చిన్న ముత్తమ్మ కుటుంబానికి రూ.10వేలు, మర్రి రాములమ్మ కుటుంబానికి రూ.10వేలు, అంతటి చంద్రయ్య కుటుంబానికి రూ.10వేలు, దోటి మల్లయ్య కుటుంబానికి రూ.10వేలు, బిస్మిల్లాబీ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, మాజీ ఎంపీటీసీ పాలగోని స్వామి, నాయకులు పల్లపు బుద్దుడు, జనార్దన్, శ్రీను పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మర్రిగూడ: తుర్కయంజాల్ ప్రో కబడ్డీ నిర్వాహకుల సహకారంతో ఇండియన్ ఒలంపిక్ కమిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్- 14 కబడ్డీ పోటీల్లో మర్రిగూడ మండల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు కోచ్ రమేష్ సోమవారం తెలిపారు. టోర్నమెంట్‌లో మర్రిగూడ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి మన్సు, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు గణేష్, అఖిల్, నితిన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. మార్చిలో చెన్నైలో జరిగే ఆల్ ఇండియా కబడ్డీ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

చాంపియన్‌గా నిలిచిన నల్లగొండ ఐఎంఏ

నల్లగొండ టౌన్: నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన డీపీఎల్ (డాక్టర్స్ ప్రీమియర్ లీగ్) 2025 క్రికెట్ టోర్నమెంట్‌లో నల్లగొండ ఐఎంఏ డాక్టర్లు చాంపియన్స్‌గా మూడోసారి నిలిచారు. హోరాహోరిగా సాగిన ఫైనల్స్‌లో తమ ప్రత్యర్థి కోదాడ రాయల్స్ జట్టుపై 40 పరుగుల తేడాతో విజయం సాధించారు. ఈ మేరకు నల్లగొండ ఐఎంఏ జట్టు సోమవారం చాంపియన్ ట్రోఫీ అందుకుంది. కార్యక్రమంలో డాక్టర్లు పుల్లారావు, రామ్‌మనోహర్, అంకుర, పరమిత్ర ప్రమవీన్, విజయ్‌కుమార్, మూర్తి, సంతోష్‌రెడ్డి, బాబురాం, సుహాస్, సురేష్, రమేష్, వెంకట్‌రెడ్డి, గణేష్, వినోద్‌కుమార్, నగేష్, హరిప్రసాద్, మమత, శ్రీనివాస్, రాము, మహేష్ పాల్గొన్నారు.



చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న నల్లగొండ ఐఎంఏ సభ్యులు

దళిత అభ్యర్థి బరిలో ఉండడం హర్షణీయం

- రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ విశారదన్ మహారాజ్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ధర్మ టీచర్స్ యూనిటీ తరపున ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న దళిత అభ్యర్థి దామెర బాబురావును గెలిపించాలని రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి సారి ధర్మ టీచర్స్ యూనిటీ నుంచి ఎమ్మెల్సీ బరిలో దళిత వర్గానికి చెందిన అభ్యర్థి బరిలో ఉండడం హర్షణీయమన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసి శాసన మండలికి పంపించాల్సిన బాధ్యత అణగారిన వర్గాలపై ఉందన్నారు. సమావేశంలో డీటీయూ సభ్యులు లింగమల్లయాదవ్, ఉపేందర్, మామిడి శంకర్, నాగయ్య, జమదగ్ని, నాగరాజు, వాసు, షాబోద్దీన్, డేవిడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

దేవస్థాన రికార్డులు సమగ్రంగా ఉండాలి

- ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నార్కట్‌పల్లి : చెరువుగట్టు దేవస్థాన రికార్డులు సమగ్రంగా ఉండాలని నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్ రెడ్డి అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టులో గల పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పనులకు సంబంధించి అన్ని రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువుగట్టులో పర్యవేక్షణ సరిగా లేదని కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌డేకు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో 2024–25 సంవత్సరంలో ఆదాయం, వ్యయం రికార్డుతో పాటు సిబ్బంది హాజరు రిజిస్టరు, వారి పర్యవేక్షణ విధానాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. రికార్డులు సరిగా లేకపోవడంతో ఈఓను వివరణ కోరామని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన రికార్డులు కొంత మేరకు అసంపూర్తిగా ఉన్నాయని, రికార్డులు కచ్చితంగా ఉండాలని, ప్రతి ఒకదానికి రికార్డుల నివేదిక తయారు చేసి ఉండాలన్నారు. ఆదాయ వనరుల రికార్డులను క్రమబద్ధీకరణతో ఏర్పాటు చేసుకోవాలన్నారు. మరో సారి తాను తనిఖీ చేసినప్పుడు ప్రతి ఒక్క రికార్డు ఉండాలన్నారు. సిబ్బంది మధ్య సమన్వయ లోపం కూడా ఉందని, తనిఖీ లోటుపాట్ల వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఆయన వెంట మండల తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, దేవాలయ కార్యనిర్వహణ అధికారి నవీన్‌కుమార్ తదితరులున్నారు.



చెరువుగట్టు దేవస్థాన పనులకు సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

గంగదేవమ్మకు బోనాల సమర్పణ



కొర్లపహాడ్‌లో గంగదేవమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న చిరుమర్తి లింగయ్య తదితరులు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో సోమవారం యాదవులు గంగదేవమ్మ జాతర నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా గంగదేవమ్మ ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మారం వెంకట్‌రెడ్డి, కె.సైదిరెడ్డి, అనుముల సత్యనారాయణ, వంటల చేతన్, జి.సత్యనారాయణ, ఊర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చెరువుగట్టు ఆలయ అభివృద్ధికి కృషి

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ఆలయాన్ని సందర్శించిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టు జడల రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని, ఆలయం చుట్టూ గిరి ప్రదర్శన ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. ఈనెల 26న మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు పోటెత్తే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వారి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు బండ సాగర్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, భరత్, నేతగాని కృష్ణ, నల్ల వెంకన్న, రెగట్టే నర్సిరెడ్డి, లింగ స్వామి తదితరులున్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టును నీటిపారుదలశాఖ ఏఈ రాములు సోమవారం పరిశీలించారు. ప్రాజెక్టులో నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరుకోవడంతో ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సరిపడా సాగునీరందక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో సోమవారం సాక్షి దినపత్రికలో అడుగంటుతున్న ప్రాజెక్టు.. తడారుతున్న పొలాలు.. శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం సంబంధిత ఏఈ రాములు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో ఉన్న నీటిమట్టం, ప్రాజెక్టు ప్రధాన కుడికాల్వపై ఏర్పాటైన అక్రమ విద్యుత్ మోటార్లు, ఎండుతున్న పంటపొలాలను పరిశీలించారు. పంటలను దృష్టిలో పెట్టుకొని కుడికాల్వకు నీటి విడుదల గేజ్‌ను పెంచారు. ఆయన వెంట ఆయకట్టు రైతులు చామల జయపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, రవీందర్, వెంకన్న, సైదులు, భిక్షం, లింగయ్య ఉన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ ఏఈ

విద్యార్థుల కోసం టాయిలెట్ల నిర్మాణం

మర్రిగూడ: మండలంలోని ఖుదాబాక్షపల్లి పాత గ్రామపంచాయతీ ఆవరణలో గత ఆరు సంవత్సరాలుగా పేద విద్యార్థులకు బొమ్మరగోని కుమార్, లింగస్వామి, మనీషా, శిరీష ఉచితంగా ట్యూషన్ చెబుతున్నారు. అయితే విద్యార్థులకు టాయిలెట్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్న విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పలువురు యువకులు మైలారపు గిరీష్, నీల వెంకటేష్, బొడ్డు గోవర్ధన్, పిట్టల మహేందర్, హరిప్రసాద్, లింగస్వామిలు కలిసి రూ.20వేలతో టాయిలెట్లు నిర్మించారు. ఈ సందర్భంగా టాయిలెట్ల నిర్మాణానికి కృషి చేసిన యువకులను గ్రామస్తులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో కాసుల హరిప్రసాద్, మిద్ద లింగస్వామి, శివలింగం, శివ నాగరాజు పాల్గొన్నారు.

నేటినుంచి రామలింగేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

నకిరేకల్: మహాశివ రాత్రి సందర్భంగా నకిరేకల్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని ముస్తాబు చేశారు. మంగళవారం నుంచి 27 వరకు శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు దర్శనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో సోమవారం గణపతి పూజ, స్వస్తి వాచనం, మండపారాధన, ఉత్సవ విగ్రహ మూర్తులకు అలంకరణ, నీరాజనం, 26న మంగళవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సామూహిక అభిషేకాలు, ఎదుర్కోళ్లు, అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం, 27న నిత్యాభిషేకం, దర్శనం, సాయంత్రం పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఐకాన్ అవార్డు అందుకున్న కిషోర్‌కుమార్



సినీహీరో సుమన్, బాబుమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కిషోర్‌కుమార్

నల్లగొండ టౌన్: సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ ఎస్సైగా పనిచేస్తున్న పల్లె కిషోర్‌కుమార్ జనయేత్రి ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఐకాన్ అవార్డు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో స్ఫూర్తి ఆర్ట్స్ కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సినీహీరో సుమన్, బాబుమోహన్‌లు ఆయనకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మునీర్ అహ్మద్, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

మునుగోడు: మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఈదమ్మ దేవాలయ నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి సోమవారం రూ. 50,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పగిళ్ల భిక్షం, ఉప సర్పంచ్ కుంభం యాదగిరి రెడ్డి, బొందు రవి, ఇరుగుదిండ్ల భిక్షం, బొందు స్వామి, పుల్కరం రాములు, మట్టిపల్లి శంకర్, శివరాత్రి యాదయ్య, వెంకన్న, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

కంతమహేశ్వర దేవాలయానికి విరాళం

శాలిగౌరారం: మండలంలోని తిరుమలరాయుని గూడెంలో గౌడ కులస్తులు నూతనంగా నిర్మిస్తున్న శ్రీకంతమహేశ్వరస్వామి దేవాలయానికి ఇటుకుల పహాడ్ గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ సోమవారం రూ.50 వేల విరాళాన్ని దేవాలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సతీష్‌కుమార్

నల్లగొండ టౌన్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండ పట్టణానికి చెందిన చిలకరాజు సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరి సత్యనారాయణ నియామకమయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి లింగస్వామియాదవ్, వెంపటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా

కట్టంగూర్: వ్యవసాయానికి 20 గంటల త్రీఫేస్, 4 గంటల సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో నల్లగొండ డీఈ అన్నయ్య తెలిపారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని మునుకుంట్ల గ్రామంలో ఆయన ఏడీ సురేష్, ఏఈ హుస్సేన్‌తో కలిసి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. గ్రామంలో నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని, బోరు బావుల్లో నీరు లేకపోవడంతో రైతు భీమనబోయిన భిక్షం సాగుచేసిన రెండెకరాల వరిపొలం ఎండిపోయిందే తప్ప.. విద్యుత్ వల్ల కాదని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెంటనే తమ సిబ్బందికి తెలియజేయాలని రైతులకు సూచించారు. ఓవర్ లోడ్ సమస్యను పరిష్కరించేందుకు కల్మెర గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించామని, త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



మునుకుంట్లలో పంటపొలాలు పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డీఈ

స్వపరిపాలన దినోత్సవం

చిట్యాల: పట్టణంలోని న్యూ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులు, ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కూల్ కరస్పాండెంట్ ఉషాప్రకాష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అతుల్య అక్షయ్, అనంతుల వెంకన్న, నర్రా భిక్షం రెడ్డి, శాలిని, శ్రీలక్ష్మీ, సబిత, సుచరిత, జ్యోతి, పూర్ణకళ, లావణ్య, లలిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.



స్వపరిపాలన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు